క్లుప్తంగా

ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ

బోట్‌క్లబ్: హోప్‌ఫర్ చేంజ్ స్వచ్ఛంద సంస్థ, రెయిన్‌బో క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జిల్లా పరిషత్ సెంటర్‌లో రాయవరపు సత్యభామ కళావేదిక సౌజన్యంతో ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హోప్‌ఫర్ చేంజ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు లక్ష్మీనాగేంద్ర మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రతి రోజు వివిధ ప్రాంతాల్లో ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేసేందుకు దాతలు సహకారం తీసుకొంటున్నామన్నారు. క్లబ్ అధ్యక్షురాలు బాలాత్రిపుర సుందరి మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించామని ఎండాకాలంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కాకినాడ రూరల్: కాకినాడ శశికాంత్‌నగర్‌లో 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్స్ డీఈఈ జి.ప్రసాద్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఫ్రెండ్స్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, శారదనగర్, వైద్యనగర్, సిటీ కాలనీ, తోట సుబ్బారావు నగర్, శశకాంత్‌నగర్, ఆర్ఆర్ నగర్, సౌజన్య నగర్, హెచ్‌పీ గ్యాస్ ఏరియా, రమణయ్యపేట తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

టాయిలెట్ల ప్రారంభం


టాయిలెట్లను ప్రారంభించిన బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు


కాకినాడ లీగల్: కక్షిదారుల సౌకర్యార్థం కాకినాడ కోర్టు కాంపౌండ్‌లో టాయిలెట్లను ప్రారంభించారు. కాకినాడ కోర్టు కాంపౌండ్‌లో జిల్లా కోర్టు అనుమతితో రిలయన్స్ వారి సహకారంతో మూడో జిల్లా కోర్టు పక్కన ఉన్న ప్రాంగణంలో కోర్టుకు వచ్చేవారి కోసం టాయిలెట్లను నిర్మించినట్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు తెలిపారు. వీటిని సోమవారం వినియోగంలోకి తీసుకొచ్చారు. బార్ అసోసియేషన్ బిల్డింగ్ ఎదురుగా ఉన్న నీటి వసతి సౌకర్యం కూడా వినియోగంలోకి తెచ్చారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్తింటి విశ్వేశ్వరరావు, జనరల్ సెక్రటరీ చెక్క శ్రీనివాస్ మాట్లాడుతూ కోర్టుకు వచ్చే కక్షిదారులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు.

పంచారామ క్షేత్రానికి భక్తుల తాకిడి


తొలి పూజ అందుకున్న కుమారా రామ భీమేశ్వర స్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువైంది. స్వామి వారికి ప్రీతైన రోజు సోమవారం కావడంతో తెల్లవారు జాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో తొలి అభిషేకం, పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను, ఉప ఆలయాలలోని దేవతామూర్తులను అలంకరించి పూజలు చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్, అల్లకి రాజ్‌గోపాల్, సన్నిధిరాజు వెంకన్న పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. ట్రస్టు బోర్డు మాజీ సభ్యులు, దేవదాయశాఖ సిబ్బంది భక్తులకు సేవలందించారు.

సత్యనారాయణకు సత్కారం


రైల్వే ఉద్యోగిని సత్కరించిన రైల్వే అధికారులు

సామర్లకోట: స్థానిక రైల్వేలో 41 సంవత్సరాల పాటు పని చేసి పదవి విరమణ పొందిన ఎస్.సత్యనారాయణను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని స్థానిక రైల్వే మేనేజరు ఎం.రమేష్ అన్నారు. సీనియర్ సెక్షన్ ఇంజినీరు సత్యనారాయణ పదవి విరమణ సందర్భంగా సోమవారం సుందరయ్య ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్థానిక రైల్వేలో 1983లో చేరిన సత్యనారాయణ సీనియర్ సెక్షన్ ఇంజినీరుగా ఉద్యోగ విరమణ చేశారన్నారు. ఉద్యోగంలో మంచి సేవలందించి డీఆర్ఎం నుంచి 9 అవార్డులు, ఒక పీసీఈఈ అవార్డు, ఒక జీఎం అవార్డు అందుకున్నారని తెలిపారు. ప్రతి ఉద్యోగి ఆయనను ఆదర్శంగా తీసుకొని పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఏడీఈఎస్ బి.శివప్రసాద్, సీనియర్ సెక్షన్ ఇంజినీరు బి.రామసుబ్బారావు, రైల్వే ఎస్ఎస్ బి.శ్రీధర్, రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ గౌరవ అధ్యక్షుడు కేవీ వెంకటేశ్వరరావు తదితరులు సత్యనారాయణ దంపతులను ఘనంగా సత్కరించారు.

అక్కచెల్లెమ్మలకు ఆర్థిక భరోసా

- వైఎస్సార్ సున్నా వడ్డీ పథకంతో ఆడపడుచులకు చేయూత
- హర్షం వ్యక్తం చేస్తున్న డ్వాక్రా మహిళలు


కాకినాడ ఐదో డివిజన్‌లో కిరాణాషాపు నిర్వహిస్తున్న మహిళా సంఘ సభ్యురాలు

బోట్‌క్లబ్: ప్రభుత్వం మహిళలకు అండగా నిలబడుతోంది. స్వయం సహాయ సంఘాల్లో అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం అందిస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తోంది. వారి పుగాభివృద్ధికి ప్రోత్సాహం అందిస్తోంది. ప్రజా సంకల్పయాత్రలో మహిళల ఆర్థిక ఇబ్బందులను చూసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తమ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలు తీసుకున్న రుణానికి వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని నవరత్నాల పథకంలో చేర్చారు. ఏటా క్రమం తప్పకుండా వడ్డీ మొత్తాలను నేరుగా స్వయం సహాయక సంఘాల అప్పు ఖాతాల్లో జమ చేస్తున్నారు. కాకినాడ నగరంలో గత ఐదేళ్లుగా 5615 మహిళా సంఘాలకు రూ.45.09 కోట్లు అందించారు.

నేరుగా అప్పు ఖాతాలకు జమ

పొదుపు సంఘ కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్ద ఎత్తున తోడ్పాటు అందజేస్తోంది. 2019లో వైఎస్సార్ సున్నా వడ్డీ కార్యక్రమాన్ని ప్రారంభించి క్రమం తప్పకుండా అందజేస్తూ వస్తోంది. తీసుకున్న రుణాల మొత్తాలను సకాలంలో చెల్లించిన అన్ని సంఘాలకు సున్నా వడ్డీని వర్తింపజేస్తోంది. స్వయం సహాయక సంఘాల అప్పుఖాతాల్లోకి నగదును జమ చేస్తున్నారు. బకాయి ఉన్న సంఘాలు పూర్తిగా చెల్లించిన తర్వాత మాత్రమే సున్నా వడ్డీకి అర్హత పొందుతాయి. ఏ నెలలో అయితే బకాయిలు పూర్తిగా చెల్లిస్తారో ఆ నెలకు మాత్రమే సున్నా వడ్డీని పొందుతున్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ కార్యక్రమాన్ని ఐదు సంవత్సరాలుగా సకాలంలో చెల్లించిన అన్ని సంఘాలకు , ఆ సంవత్సరంలో తీసుకున్న కొత్త రుణాలకు సైతం సున్నా వడ్డీ రుణాలను విడుదల చేస్తోంది.

చిరు వ్యాపారాలతో...

మహిళా సంఘాలకు బ్యాంకులు ఇచ్చే రుణాలతో ఇంటి వద్ద చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొని వారి కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇంటి సమీపంలోనే కిరణాషాపు, టీ షాపు, బడ్డీకొట్టు వంటి పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. బ్యాంకు ఇచ్చిన రుణంకు వడ్డీ భారం పడకుండా ప్రభుత్వం వడ్డీ రాయితీ ఇవ్వడం ఆయా సంఘాల్లో సభ్యులకు ఎంతో లాభం చేకూరుతుంది.

జగనన్న మేలు మరువలేం



మహిళలను ఆర్థికంగా ఆదుకుంటున్న సీఎం జగనన్న మేలు ఎప్పటికీ మరువలేం. గత ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు. జగనన్న చెప్పిన దాని కన్నా ఎక్కువ చేస్తున్నారు. గత ప్రభుత్వంలోని డ్వాక్రా రుణాలను మాఫీ చేయడంతో పాటు మాకు ఎంతో మేలు జరుగుతోంది. మా గ్రూపునకు రూ.1.25 లక్షలు సున్నా వడ్డీ లభించింది.

– కె.అనురాధ, మెహబూబా మహిళా సంఘం

రుణపడి ఉంటాం



వైఎస్సార్ సీపీ మహిళల పక్షపాతి ప్రభుత్వం. అందుకే ప్రతి పథకాన్ని మహిళల పేరిట అమలు చేస్తున్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ కింద మా గ్రూపునకు రూ.80 వేలు వచ్చింది. గత ఐదు సంవత్సరాలు వడ్డీ రాయితీ అందిస్తున్నారు. జగనన్న కుటుంబానికి మా ప్రభుత్వం ఎప్పటికీ రుణపడి ఉంటుంది.

– కె.భాగ్యలక్ష్మి, వేంకటేశ్వర మహిళా సంఘం

నన్నయ్య ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ పరిశీలన


డిస్ట్రిబ్యూషన్ సెంటరులో ఏర్పాట్లు పరిశీలించి, సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్వో కిశోర్

కాకినాడ రూరల్: తిమ్మాపురం గ్రామ పరిధి అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ్య ఎంఎస్ఎస్ పీజీ సెంటరులో కాకినాడ రూరల్ నియోజకవర్గ డిస్ట్రిబ్యూషన్ సెంటరు ఏర్పాట్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇట్ల కిశోర్ సోమవారం పరిశీలించారు. మే 13న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ముందు రోజున పీజీ సెంటరు నుంచి నియోజకవర్గంలోని 264 పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు, ఈవీ ప్యాడ్‌లు, ఇతర ఎన్నికల సామగ్రిని ఇక్కడ నుంచి ఎన్నికల సిబ్బందికి పంపిణీ చేయనున్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటరులో మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై సిబ్బందితో చర్చించిన ఆర్వో పలు సూచనలు ఇచ్చారు. ఎన్నికల సామగ్రి భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని అన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ద్వారంపూడి, సతీమణి మహాలక్ష్మి


రమణయ్యపేటలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలు

కాకినాడ: స్థానిక 31వ డివిజన్ సూర్యనారాయణపురానికి చెందిన పలువురు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఇటీవలే జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన మాకినీడి శేషుకుమారి ఆధ్వర్యంలో సుమారు 40 మంది పార్టీలోకి చేరేందుకు ముందుకు రాగా వీరికి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం జగన్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్టు వీరంతా ప్రకటించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి అంకిత భావంతో కష్టించి పనిచేయాలని ఎమ్మెల్యే ద్వారంపూడి సూచించారు.

కాకినాడ రూరల్: మండలంలోని సర్పవరం, రాయుడుపాలెం నుంచి టీడీపీ, జనసేన కార్యకర్తలు భారీగా వైఎస్సార్ సీపీలోకి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సమక్షంలో సోమవారం రాత్రి చేరారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయం వద్ద కరప మండలం గురజనాపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు బెజవాడ బాబ్జీ, పబ్బినీడి దుర్గారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సింహాద్రి ప్రేమ్‌కుమార్, విత్తనాల ఆదివాబు, రాజ్బల్ సురేష్, నడికట్ల శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, సమ్మంగి రాజు, కొప్పిశెట్టి సురేష్, తిరుమలకొండ మంగాదేవి, సింహాద్రి రత్నం, జయ, మేరి, సునీత, చంద్ర కుమారి, శ్యామల తదితరులు చేరారు. వీరికి ఎమ్మెల్యే కన్నబాబు పార్టీ కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ మే నెలలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి విజయం అందించాలన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా సునీల్‌ను గెలిపించాలని కోరారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

సిటీ ఆర్వో జె.వెంకటరావు ఆదేశం


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు

కాకినాడ: కాకినాడ జిల్లా పరిధిలోని సిటీ, రూరల్, పిఠాపురం, పెద్దాపురం, ప్రత్తిపాడు, జగ్గంపేట, తుని నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ స్ట్రాంగ్‌రూమ్‌లకు పటిష్ట భద్రత కల్పించాలని కాకినాడ సిటీ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు ఆదేశించారు. ఆయా నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్, స్ట్రాంగ్‌రూమ్‌లను ఏర్పాటు చేసిన జేఎన్‌టీయూకే సివిల్‌బ్లాక్, లైబ్రరీ, మెకానికల్ విభాగం, ఆర్ఎంసీ ప్రాంతాలను ఇతర నియోజకవర్గ ఆర్వోలతో కలిసి సందర్శించారు. ఆయా ప్రాంగణాల్లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ సెంటర్లు, స్ట్రాంగ్‌రూమ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అక్కడ పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ మేరకు అధికారులకు సూచనలు ఇచ్చారు. విధుల్లో ఉండే ఉద్యోగులతోపాటు విధుల్లో సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ముగ్గురు ఉద్యోగులకు జీఎం సేఫ్టీ అవార్డులు


అవార్డు అందజేస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ, సకాలంలో సమస్యలను గుర్తించి ప్రమాదాలు జరుగకుండా సిబ్బందిని అప్రమత్తం చేసిన విజయవాడ డివిజన్‌కు చెందిన ముగ్గురు ఉద్యోగులకు 'మ్యాన్ ఆఫ్ ద మంత్ జీఎం సేఫ్టీ అవార్డులు' వరించాయి. సోమవారం దక్షిణ మధ్య రైల్వే హెడ్‌క్వార్టర్స్ సికింద్రాబాద్‌లోని రైలు నిలయంలో ఏజీఎం ధనుంజయులు విజయవాడ, గుంటూరు, గుంతకల్లు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్‌ల డీఆర్ఎంలతో భద్రతా చర్యలపై వర్చువల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ క్రమం తప్పకుండా సేఫ్టీ డ్రైవ్‌లు, రాత్రుళ్ల సెక్షన్‌లలో తనిఖీలు చేపట్టాలన్నారు. విధుల్లో అప్రమత్తంగా వ్యవహరిస్తూ వ్యవస్థలో లోపాలను గమనించి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మ్యాన్ ఆఫ్ ద మంత్ సేఫ్టీ అవార్డ్స్ ఫిబ్రవరి–2004కి ఎంపికైన ఉద్యోగులను ఏజీఎం ప్రకటించారు. విజయవాడ డివిజన్ నుంచి ఎంపికైన రాజమహేంద్రవరంలో టెక్నీషియన్ ఎస్ఎస్ బ్రహ్మణ్యం, కాకినాడ పోర్టులో గూడ్స్ లోకో పైలట్ కేవీవీఎస్ నారాయణ, విజయవాడ ట్రాలీ మెన్ వి.వీరలింగేశ్వరరావులకు డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ తన కార్యాలయంలో జీఎం అవార్డులను అందజేసి అభినందనలు తెలిపారు.

వృద్ధులకు పింఛన్లు అందకుండా బాబు కుట్ర

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ద్వారంపూడి
- ప్రజల నుంచి అపూర్వ స్పందన


వృద్ధురాలిని ఓటు వేయమని అభ్యర్థిస్తున్న సిటీ ఎమ్మెల్యే సతీమణి ద్వారంపూడి మహాలక్ష్మి


ఎన్నికల ప్రచారంలో మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: వృద్ధాప్య, దివ్యాంగ, వితంతు పింఛన్లను ఇంటి వద్దకు వెళ్లి పంపిణీ చేయకుండా చంద్రబాబు కుట్ర చేశారని, పేదలకు నరకం చూపిస్తున్నారని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన 6వ డివిజన్ రెల్లిపేట, రేచర్లపేట, రాజీవ్‌గృహకల్ప, రైతుబజార్ వెనుక ఉన్న ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. ప్రజలను కలిసి గడచిన ఐదేళ్లలో సాధించిన ప్రగతిని వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను గెలిపించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఇల్లు దాటనివ్వకుండా గడచిన నాలుగున్నరేళ్లలో సీఎం జగన్ పింఛన్లను ఇంటి వద్దకే పంపిణీ చేశారన్నారు. ఇది జీర్ణించుకోలేని టీడీపీ అధినేత చంద్రబాబు కుట్ర చేసి పాత పద్ధతిలో సచివాలయాల వద్దకే వెళ్లి పింఛన్లు తీసుకునేలా చేశారని విమర్శించారు. చంద్రబాబు చర్యలతో పేదలు కంటతడి పెట్టుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజల నుంచి వలంటీర్లను దూరం చేయగలరే తప్ప ప్రజల గుండెల నుంచి ప్రజలను తప్పించలేరన్నారు.

కొండబాబు గ్రాఫిక్స్

వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీకి భారీగా వలసలు వచ్చేస్తున్నారంటూ కొండబాబు గ్రాఫిక్స్ చూపిస్తున్నారని ఎమ్మెల్యే ద్వారంపూడి విమర్శించారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న తాను టీడీపీలో చేరిన వారు ఎవరినీ వైఎస్సార్ సీపీలో చూడలేదన్నారు. నామినేషన్లలోపు టిక్కెట్ మారిపోతుందనే భయంతో తనకు అనుకూలంగా ఇతర పార్టీల నుంచి వచ్చేస్తున్నారంటూ టీడీపీ అధిష్టానానికి భ్రమ కల్పిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. చేసిన అభివృద్ధి తనను మరోసారి గెలిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు జార్జి, వినోద్, సారథి, గాంధీ, అంజి, మాధవకుమార్, సుధాకర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సతీమణి విస్తృత ప్రచారం

ఎమ్మెల్యే ద్వారంపూడి సతీమణి ద్వారంపూడి మహాలక్ష్మి సోమవారం 39వ డివిజన్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గాంధీబొమ్మ సెంటర్, హౌస్‌ఆఫ్‌ప్రేయర్, అక్షయపాత్ర వీధి ప్రాంతాల్లో పర్యటించిన ఆమెకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. గడచిన ఐదేళ్లలో చేసిన అభివృద్ధిని చూసి భర్త ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, స్థానిక నాయకులు డీకే రెడ్డి, మధు, దండు మహాంతి, ఇనుకొండ పట్టాభిరామయ్య, కుసుమకుమారి, కృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ఇంద్రజాల ప్రదర్శన


ప్రదర్శనలో మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక సభ్యులు

కాకినాడ సిటీ: జన విజ్ఞాన వేదిక కాకినాడ నగర శాఖ ఆధ్వర్యంలో కాకినాడ రూరల్ మండలం తూరంగి అల్లూరి సీతారామరాజు కాలనీలో మూఢ నమ్మకాల వ్యతిరేక ప్రదర్శన, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా సైన్స్ ఇంద్రజాల ప్రదర్శన సోమవారం రాత్రి నిర్వహించారు. వేదిక జిల్లా అధ్యక్షుడు కేఎంఎంఆర్ ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో మూఢనమ్మకాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెవీవీ సభ్యులు బీవీవీ సత్యనారాయణ, వెంకట ప్రసాద్, సీహెచ్ అజయ్‌కుమార్‌లు పలు శాస్త్రీయ ప్రయోగాలు, ఇంద్రజాల ప్రదర్శనలు నిర్వహించారు.

వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించండి

- అధికారుల సమీక్షలో కలెక్టర్ నివాస్
- కలెక్టర్, జేసీలకు వీడియో కాన్ఫరెన్స్


సీఎస్ జవహర్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నివాస్

కాకినాడ సిటీ: వేసవి తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అధికారులు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి వెలగపూడి సచివాలయం నుంచి సోమవారం కలెక్టర్, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ నివాస్ పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు వడదెబ్బకు గురికాకుండా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమన్వయం చేసుకొని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అత్యవసరమైతే తప్ప ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య బయటకు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఉపాధి హామీ పథకానికి సంబంధించిన కేంద్ర ప్రభుత్వం కూలీల వేతనం పెంచుతూ నూతన మార్గదర్శకాలు విడుదల చేసిందన్నారు. నేటి నుంచి ఉపాధి కూలీల దినసరి వేతనం రూ.272 నుంచి రూ.300లకు పెరిగిన నేపథ్యంలో అధికారులు కూలీల సంఖ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఉపాధి కూలీలు వడదెబ్బకు గురి కాకుండా పని సమయం ఉదయం 6 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు ఉండేలా చూడాలన్నారు. పని చేసే ప్రాంతంలో తాగునీరు, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తతతో వ్యవహరించాలని కలెక్టర్ నివాస్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం, కూలీల వేతనం, పనిదినాలు, తాగునీటి సరఫరా, వడగాల్పులు, వేసవిలో విద్యుత్ సరఫరా, పింఛన్ల పంపిణీ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్‌తో సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో డి.తిప్పేనాయక్, డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, డీపీవో కె.భారతి సౌజన్య, ఏపీఈపీడీసీఎల్ ఈఈ జీ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎం.శ్రీనివాసు, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి జె.నరసింహనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి నలుగురికి గాయాలు

సామర్లకోట: స్థానిక ఇండస్ట్రియల్ ఏరియా విమల్ బాట్లింగ్ కంపెనీ ఎదురుగా సోమవారం ఆటో బోల్తా పడడంతో నలుగురు విద్యార్థినులు గాయపడిన సంఘటన ఇది. స్థానిక బ్రౌన్‌పేటలో ఉన్న ప్రైవేటు డిగ్రీ కళాశాల నుంచి విద్యార్థినులు పెద్దాపురం, మండల పరిధిలోని గ్రామాలలోని వారి స్వగృహాలకు వెళ్లడానికి ఆటో ఎక్కారు. ఆటో సీబీఎం సెంటర్ నుంచి విమల్ బాట్లింగ్ కంపెనీ వద్ద ముందు వెళుతున్న మోటారు సైకిల్‌ను తప్పించే క్రమంలో బోల్తా పడింది. దాంతో ఆటోలో ఉన్న నలుగురి విద్యార్థినులు గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. విద్యార్థునులు పెద్దాపురం, ఆర్‌బీ పట్నం, ఆర్‌బీ కొత్తూరుకు చెందిన వారుగా గుర్తించారు. ప్రమాద సంఘటన విషయం తెలిసిన వెంటనే వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేలా చూడాలని తమ కార్యకర్తలకు సూచించారు. దాంతో పార్టీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్‌కుమార్ హుటాహుటిన ఆస్పత్రికి చేరుకొని విద్యార్థుల వివరాలు సేకరించారు. విషయం తెలిసి ఎస్సై మౌనిక ఆస్పత్రికి చేరుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థినులకు మెరుగైన వైద్యం కోసం అచ్చంపేట ఏడీబీ రోడ్డు లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.